www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 2 సంచిక -333 మంగళవారం 18 ఫిబ్రవరి 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## కొత్త సీఈసీ కోసం
# కేంద్రం కసరత్తులు

**రాజీవ్ కుమార్ పదవీవిరమణ...**

**కొత్త సీఈసీ కోసం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశం**

**నేటితో ముగియనున్న సీఈసీ రాజీవ్ కుమార్ పదవీకాలం**

**అభ్యంతరం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకత్వం**

హైదరాబాద్,ఫిబ్రవరి17(ప్రజావినికిడి: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ రేపు (ఫిబ్రవరి 18) పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో, నూతన సీఈసీ ఎంపిక కోసం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు కూడా హాజరయ్యారు. ఈ సమావేశం ముగిసిన అనంతరం రాహుల్ గాంధీ ఓ కీలక నోట్ సమర్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఎన్నిక కోసం రూపొందించిన చట్టం అంశం సుప్రీం కోర్టులో విచారణలో ఉందని, ఇలాంటి సమయంలో నేడు ఈ సమావేశం నిర్వహించకుండా ఉంటే బాగుండేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడంత పట్టుదలకు పోవాల్సిన అవసరం ఏముందని, సుప్రీం కోర్టు నిర్ణయం వచ్చే వరకు ఆగితే బాగుండేదని అభిప్రాయపడ్డారు

మిగతాది 2లో...

## కుల సంఘాలకు హైకోర్టు షాక్

2లో.

**ఆయా భూముల్లో నిర్మాణాలకు బ్రేక్**

**మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన ధర్మాసనం**



# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సమస్యరాకుండా చూడాలని సాగు,తాగునీటిపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీచేశారు.

**క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించాలి**

**అధికారులకు సిఎం రేవంత్ ఆదేశాలు**

**ఇసుక అక్రమ దందాపై కఠిన చర్యలు**

**అక్రమార్కులపై చర్యలకు ఆదేశం**

**ఇసుక అక్రమాలపై సిఎం రేవంత్ సమిక్ష**



హైదరాబాద్,ఫిబ్రవరి17(ప్రజావినికిడి: ఎండాకాలంలో ఎక్కడా తాగు,సాగునీటి సమస్య రావొద్దని..ప్రణాళిక ప్రకారం అధికారులు ముందుకెళ్లాలని ఆదేశించారు. ఎండలు పెరిగే కొద్దీ గడ్డు పరిస్థితులు తలెత్తుతాయి.. రాబోయే 3 నెలలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయికెళ్లి పరిస్థితులను అంచనా వేయాలని చెప్పారు. పంటలు ఎండిపోకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు సీఎం రేవంత్. కొత్త రేషన్ కార్డులు జారీ, తాగు, సాగునీరు, ఇసుక అక్రమ రవాణాపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు.ప్రాజెక్టుల్లో నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.శ్రీశైలం,నాగార్జున సాగర్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు రేవంత్. నిర్ణీత కోటా కంటే ఏపీ ఎక్కువ నీటిని తరలించకుండా చూడాలి.. దీని టెలిమెట్రీ విధానం అమలు చేయాలని ఆదేశించారు. టెలిమెట్రీ విధానానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

మిగతాది 2లో...

## తొక్కిసలాట ఘటనతో రైల్వేశాఖ అప్రమత్తం

**రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక హోల్డింగ్ జోన్స్**



2లో.

## కోడ్ లేని జిల్లాల్లో వెంటనే కొత్త రేషన్‌కార్డులు

**ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో సత్వర చర్యలు**

**అధికారులతో సమీక్షించిన సిఎం రేవంత్**



2లో.

# కారణజన్ముడు కేసీఆర్

**కొడుకుగా పుట్టడం నా అదృష్టం : కేటీఆర్**

**ఓ పెళ్లి మంటపంలో అరుదైన దృశ్యం**

**దండలు మార్చుకున్నకెసిఆర్ దంపతులు**



హైదరాబాద్,ఫిబ్రవరి17(ప్రజావినికిడి: కారణజన్ముడు కేసీఆర్ కొడుకుగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ కేవలం తనకు మాత్రమే కాదు యావత్ తెలంగాణ జాతికి హీరో అని పేర్కొన్నారు. ఉద్యమం కోసం నడుం బిగించిన నాడు మీడియా లేదు, మద్దతు లేద గుర్తుచేశారు. మీడియా, మనీ, మజిల్ పవర్ లేకుండా తెలంగాణను సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఉద్యమాన్ని నడిపారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. కేసీఆర్ 71వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మిగతాది 2లో...

## కులగణను పక్కదారి పట్టించే యత్నాలు

**రాహుల్ కులం పేరుతో బిజెపి వ్యర్థ రాజకీయం బండి వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి సీతక్క**



2లో.

## ఢిల్లీ బీజేఎల్పీ సమవేశం 19కి వాయిదా

**సిఎం ఎంపికలో బిజెపి మల్లగుల్లాలు**



2లో.



# కులగణన కొరివితో తలగోక్కున్న కాంగ్రెస్

**ముస్లింలను తొలగిస్తేనే బిజెపి ఆమోదిస్తుంది కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ**

హైదరాబాద్,ఫిబ్రవరి17(ప్రజావినికిడి: కులగణనతో కాంగ్రెస్ కొరివితో తలగొక్కోంటోందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బిల్లు పంపతామంటే ఆమోదించడానికి మేమేమైనా ఎడ్డోళ్లమా? అని ఆయన వ్యాఖ్యానించారు. ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించకుంటే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదని, ముస్లింలను తొలగించి బీసీ జాబితా పంపితే కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత మాదే అని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో.. తెలియదని, ఐఏఎస్ లను తప్పు చేయాలని ముఖ్యమంత్రే అంటారా అని బండి సంజయ్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర కేబినెట్ మంత్రుల్లో, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చిందని, కొందరు మంత్రులు ప్రతి పనికి 15 శాతం కమిషన్ దండుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్.. మేధావులారా?. బాకీల సర్కార్ ను బండకేసి బాదండి.. 3 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలవబోతోందని ఆయన అన్నారు. అంతేకాకుండా..'ఇకపై ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించేది బీజేపీనే.. ఓట్లు అడిగే బీజేపీకే ఉంది.. ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన నిరంతరం కొట్లాడి జైలుకు వెళ్లింది బీజేపీ కార్యకర్తలే. మిగతాది 2లో...

# కొత్త సీఈసీ కోసం కేంద్రం కసరత్తులు

(మొదటి పేజి తరువాయి)

కాగా, ఈ అంశంలో సుప్రీంకోర్టు ఫిబ్రవరి 22న వాదనలు విననుంది. సీఈసీ ఎంపిక ప్రక్రియను వాయిదా వేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. సీఈసీ నియామకంపై అత్యున్నత న్యాయస్థానం ఎలాంటి స్టే విధించనందున, ప్రధాని మోదీ నేతృత్వంలోని కమిటీకి మార్గం సుగమం అయిందని ఆ వర్గాలు తెలిపాయి. కోర్టు న్యాయపరమైన అభిప్రాయం కోరడంతో, కోర్టు కోరిన వివరాలు సమర్పించడం జరిగాయని... సీఈసీ ఎంపికకు ఎలాంటి అడ్డంకులు లేవని కేంద్రం భావిస్తోందని పేర్కొన్నాయి.అటు, నూతన సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకంపై రేపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేస్తారని తెలుస్తోంది.

# కుల సంఘాలకు హైకోర్టు షాక్

## ఆయా భూముల్లో నిర్మాణాలకు బ్రేక్

## మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన ధర్మాసనం

హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి: కసిఆర్ హయాంలో వివిధ కులసంఘాలకు కేటాయించిన భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో కమ్మ, వెలమ, విశ్వబలిజ కాపు సంఘాలకు కేటాయించిన భూముల్లో ఇకపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ ఇప్పటికే నిర్మాణాలు చేపట్టి ఉన్నట్లయితే అవి తుది తీర్పునకు లోబడి ఉంటాయని గతంలోనే ఉత్తర్వులున్నాయనీ.. వీటితోపాటు ఇకపై ఎలాంటి నిర్మాణాలు, చేపట్టరాదని వెలమ, కమ్మ, విశ్వబలిజ కాపు సంఘాలకు ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో కమ్మ, వెలమ సంఘాల కమ్యూనిటీ భవనాలకు ఐదెకరాలు, విశ్వ బలిజ కాపు సంఘం కమ్యూనిటీ భవనానికి ఆరెకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం వేర్వేరు జీవోలు జారీ చేసింది. ఈ జీవోలపై రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, న్యాయవాది సుంకర నరేష్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం కుల సంఘాలకు నామమాత్రపు ధరకే భూమిని కేటాయించిందన్నారు. ఇందులో నిర్మాణాలు జరగకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని, ఆ జీవోలను కొట్టివేయాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రభుత్వ వివరణ కోరుతూ విచారణను మార్చి 7కు వాయిదా వేసింది.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లలో వెంటనే తనిఖీలు చేపట్టాలని సీఎం రేవంత్.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని సంబంధిత శాఖ అధికారులకు చెప్పారు. ఓవర్ లోడ్, అక్రమ రవాణాపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝుళిపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అక్రమార్కులను వదిలేది లేదని హెచ్చరించారు. అక్రమదందాకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశంచారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఈ సమస్యపై సమగ్రంగా చర్చించారు. అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అణచివేయాలని సంబంధిత శాఖల అధికారులను సీఎం ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక సరఫరా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు తగినంత ఇసుక కావాంటే ముందుగా అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలని సీఎం సూచించారు. ఇదిలా ఉండిగా ఇందిరమ్మ పథకం కింద లబ్దిదారులకు రూ. 5 లక్షలు అందించనున్నారు. వాళ్ల ఖర్చును తగ్గించేందుకు ఇసుకను ఉచితంగా అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అక్రమ రవాణా అడ్డుకట్ట తప్పనిసరి అని సీఎం పేర్కొన్నారు. అందుకే, అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంతోపాటు, ప్రభుత్వ పథకాలకు అవసరమైన ఇసుక సరఫరా నిరాటంకంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# తొక్కిసలాట ఘటనతో రైల్వేశాఖ అప్రమత్తం

## రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక హోల్డింగ్ జోన్స్

న్యూఢిల్లీ,,ఫిబ్రవరి17ప్రజావినికిడి: దేశ రాజధానిలోని న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో గత శనివారం జరిగిన తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని తీవ్రంగా కలచివేసింది. కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే ప్రయాణికులు పోటెత్తడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు వద్ద, ప్లాట్‌ఫాంపై గందరగోళంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్లలో రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక హోల్డింగ్ జోన్స్‌ను ఏర్పాటుచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా అత్యధిక ట్రాఫిక్ ఉండే 60 రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు శాశ్వత హోల్డింగ్ ప్రాంతాలను నిర్మించాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. అంతేగాక, రద్దీ నియంత్రణ, విపత్తు నిర్వహణ కోసం కృత్రిమ మేధను వినియోగించనున్నట్లు సదరు కథనాలు వెల్లడించాయి. దీనిపై అవగాహన కల్పించేందుకు స్థానిక అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారట. ఈ హోల్డింగ్ ఏరియాల వద్దకు ప్రయాణికులు వెళ్లేందుకు వీలుగా సెపరేటర్లు, గుర్తులు ఏర్పాటుచేయనున్నట్లు తెలుస్తోంది. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో గత శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కుంభమేళాకు వెళ్లే వారితో రైల్వేస్టేషన్‌లోని 14, 15వ ఎ÷-లాట్‌ఫాంలు కిక్కిరిసిపోయి ఉన్నాయి. 14వ నంబరు ప్లాట్‌ఫాం పైకి ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రావాల్సిఉంది. అదే సమయంలో ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైలు 12వ నంబరు ప్లాట్‌ఫాంపైకి వస్తోందని రైల్వేస్టేషన్‌లో ప్రకటన వెలువడిందని, దీంతో ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ అదే అనుకొని జనమంతా 12వ నంబరు ప్లాట్‌ఫాం పైకి వెళ్లాలని ఒక్కసారిగా తోసుకుంటూ వచ్చారు. అదే సమయంలో 14వ నంబరు ఎ÷-లాట్‌ఫాం పైకి భారీగా వస్తున్న జనం జారి వారిపై పడటంతో తొక్కిసలాట జరిగిందని రైల్వే బోర్డు సమాచార విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ ఘటనపై రైల్వేశాఖ ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టింది.

# ఆర్టీసీ ప్రయాణికులకు మరో గుడ్‌న్యూస్

## తెలంగాణ టు బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు 10శాతం రాయితీ

హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి: తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు కాంగ్రెస్ ప్రభుత్వం మరోగుడ్‌న్యూస్ చెప్పింది. ఇప్పటికే తెలంగాణలో మహాలక్ష్మీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ కార్డ్ ఉన్న ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ప్రయాణ ఛార్జీలో ఏకంగా 10 శాతం రాయితీని ప్రకటించింది. అయితే ఇది అన్ని రూట్లలో కాదు. తెలంగాణ నుంచి బెంగళూరుకు ప్రయాణించే వారికి టిక్కెట్ ధరలో పది శాతం రాయితీ కల్పిస్తున్న ప్రకటించింది. బెంగళూరు రూట్‌లో నడిచే అన్ని సర్వీసుల్లోనూ రానుపోనూ ఈ రాయితీ వర్తించనుంది. ఈ రాయితీ వల్ల ఒక్కొక్కరికి రూ.100 నుంచి రూ.160 వరకూ ఆదా అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ రూట్ లో టికెట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం వెబ్ సైట్‌ని సంప్రదించాల్సింది సూచించారు. అయితే తెలంగాణ నుంచి చాలా మంది బెంగళూరు సిటీకి వెళ్తుంటారు. వ్యాపార పనులపై, అలాగే ఉద్యోగ రిత్యా అక్కడ పనిచేసే వారు కూడా తరచూ బెంగళూరుకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇలాంటి వారికి ఇప్పుడు టీజీఎస్ ఆర్టీస్ ప్రకటించిన ఈ రాయితీ ఎంతో మేలు కూరుతుంది.

### మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70 ఏళ్లు పూర్తి చేసుకొని నేడు 71 వసంతంలోకి అడుగుట్టారు.. కేసీఆర్ పుట్టినరోజు సదర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా.. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు కూడా పెద్ద ఎత్తున కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్నారు. అయితే.. కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.. ఎక్స్‌లో బర్త్‌డే విషెస్ చెబుతూ పోస్ట్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి.. సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలంటూ ఆకాంక్షించారు.. రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతూ ప్రజాసేవలో నిమగ్నం కావాలని రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

# కోడ్ లేని జిల్లాల్లో వెంటనే కొత్త రేషన్‌కార్డులు



హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి:
%రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదకుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. సోమవారం పౌరసరఫరాల శాఖపై సీఎం సౌరసరఫరాల శాఖ మంతి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులు, కొత్త రేషన్ కార్డుల డిమాండ్, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు సంబంధించిన అంశాలపై సీఎం అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆయా జిల్లాల్లో కొత్త కార్డులు ఇవ్వాలని సూచించారు. కొత్త కార్డులకు సంబంధించి రూపొందించిన డిజైన్లను సీఎం పరిశీలించారు. ప్రజా పాలనలో వచ్చిన అర్జీలు,కుల గణనతో పాటు గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులు, మీ సేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులు అన్నింటినీ పరిశీలించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మీ సేవా కేంద్రాల వద్ద రేషన్ కార్డుల కోసం జనం రద్దీ ఎందుకు ఉంటుందని సీఎం అధికారులను ప్రశ్నించారు. దానికి ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులకు అవకాశమిచ్చినప్పటికీ, దరఖాస్తు చేసిన కుటుంబాలే మళ్లీ మళ్లీ చేస్తున్నాయని, అందుకే రద్దీ ఉంటుందని అధికారులు వివరణ ఇచ్చారు. వెంటవెంటనే కార్డులు జారీ చేస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, ఆలస్యం చేయకుండా వెంటనే కొత్త కార్డులు జారీ చేసేందుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన కుటుంబాలు మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# కులగణను పక్కదారి పట్టించే యత్నాలు

## రాహుల్ కులం పేరుతో బిజెపి వ్యర్థ రాజకీయం బండి వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి సీతక్క



హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి:
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యల పట్ల మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు కల్పించాలన్నదే రాహుల్ గాంధీ అభిమతమని స్పష్టం చేశారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని రాహుల్ గాంధీ కులగణన కోసం డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ..రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా బీసీ కులగణన కోసం పట్టుబడుతున్నారన్నారు. కులగణన అంశాన్ని పక్కదారి పట్టించేందుకు రాహుల్ గాంధీని బీజేపీ నేతలు టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ విజన్ ఉన్న నాయకుడని తెలిపారు. 30 సంవత్సరాలుగా ఎలాంటి మంత్రి పదవుల్లో లేకుండా దేశం కోసం పనిచేస్తున్నారని చెప్పుకొచ్చారు. అందుకే గ్రామ స్థాయి నుంచి ప్రధాని వరకు రాహుల్ గాంధీని టా÷-గ్గ్ం÷ట్ చేస్తూ కించపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. విద్వేష, విధ్వంసమే బీజేపీ విధానమని వ్యాఖ్యలు చేశారు. ప్రేమ, శాంతి, సమానత్వం కోసం రాహుల్ గాంధీ పనిచేస్తున్నారని
చెప్పారు. బీజేపీ విద్వేష విధ్వంసాలు కావాలో.. కాంగ్రెస్ శాంతి, సమానత్వం, అభివృద్ధి కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. కుల గణన అంశాన్ని డైవర్ట్ చేయడం కోసమే రాహుల్ మతంపై చర్చ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా దేశం కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం బీజేపీ చేసింది ఏమీ లేదన్నారు. విభజన రాజకీయాలతో పదవులు పొందటం బీజేపీ నేతల నైజమని వ్యాఖ్యలు చేశారు. రాహుల్ పదవుల కోసం పాకులాడే మనిషి కాదన్నారు. త్యాగాల వారసత్వంతో సమాజ అభివృద్ధి కోసం, సమసమాజ లక్ష్యం కోసం రాహుల్ పోరాటం చేస్తున్నారని వెల్లడించారు. ఆదాని ఆస్తుల పెంపకం కోసం రాహుల్ పనిచేయటం లేదని తెలిపారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అంతరాలు లేని సమాజమే రాహుల్ గాంధీ లక్ష్యమని స్పష్టం చేశారు. బీజేపీ విద్వేష రాజకీయాలతో సమాజం వెనుకబాటుకు లోనవుతోంద న్నారు. తొలి ప్రధాని నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు చేపట్టిన సంస్కరణలే ఈరోజు దేశాన్ని నిలబెడుతున్నాయని తెలిపారు. రాజ్యాంగ మీద ప్రమాణం చేసి కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్ నిర్దేశ ప్రసంగాలు చేస్తూ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారన్నారు. అణగారిన వర్గాలు, పేద ప్రజలంటే బీజేపీకి పట్టదని.. ప్రజలంతా బీజేపీ నైజాన్ని గ్రహించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# ఢిల్లీ బీజేఎల్పీ సమావేశం 19కి వాయిదా

## సిఎం ఎంపికలో బిజెపి మల్లగుల్లాలు




**న్యూఢిల్లీ,**ఫిబ్రవరి17ప్రజావినికిడి:
ఢిల్లీ బీజేపీ శాసనసభాపక్ష సమావేశం వాయిదా పడింది. సోమవారం జరగాల్సిన బీజేఎల్పీ సమావేశాన్ని అధిష్ఠానం ఫిబ్రవరి 19 వతేదీ మంగళవారానికి వాయిదా వేసింది. దీంతో తదుపరి సిఎం ఎవరన్న విషయం మరింత ఆలస్యం కానుంది. 8ననే ఫలితాలు వచ్చినా సిఎం అభ్యర్థిని ఎంపికచేయడంలో బిజెపి మల్లగుల్లాలు పడుతోంది. సోమవారం ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఎవరనే విషయానికి తెరపడుతుందని అంతా భావించారు. కాగా, ఢిల్లీ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. దీంతో నూతన సీఎంపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఫిబ్రవరి 19న జరిగే సమావేశంలో బీజేఎల్పీ నేతను ఎన్నుకోనున్నారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన 48 మంది బీజేపీ ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. అలాగే కమలం పార్టీ ఎంపీలు సైతం హాజరుకానున్నారు. బీజేఎల్పీ నేత ఎన్నిక తర్వాత ఎమ్మెల్యేలు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలవనున్నారు. ఇప్పటికే ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం కోర్డినేటర్లుగా వినోద్ తావ్డే, తరుణ్ చుగ్‌లను బీజేపీ అధిష్ఠానం నియమించింది. మరోవైపు ఫిబ్రవరి 20న ముఖ్యమంత్రి, మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి తేదీ సైతం ఖరారు చేసింది. కాగా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేసులో పర్వేష్ వర్మ(న్యూ ఢిల్లీ), రేఖా గుప్తా (షాలిమార్ బాగ్), విజేందర్ గుప్తా (రోహిణి), సతీష్ ఉపాధ్యాయ్ (మాల్వియా నగర్), ఆశిష్ సూద్ (జనక్‌పురి), పవన్ శర్మ (ఉత్తమ్ నగర్), అజయ్ మహావార్ (ఘోండా) ఉన్నారు. ఏడాది ఫిబ్రవరి 5న జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగరవేసిన సంగతి తెలిసిందే. దాదాపు 27 ఏళ్ల తర్వాత కమలం పార్టీ అక్కడ అధికారంలోకి రానుంది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 48 స్థానాలను బీజేపీ కైవలం చేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు పలువురు కీలక నేతలు ఓటమి పాలయ్యారు. కాగా, ప్రస్తుతం ఢిల్లీ సీఎం ఎవరనే విషయం ఉత్కంఠ కొనసాగుతోంది

# కులగణన సర్వేను ఉపయోగించుకోండి

## మరోమారు కోరిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి:
కులగణన వివరాల నమోదుకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం ప్రజలకు ఇచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. కుల సర్వే లో పాల్గొనని వారు సమాచారం ఇవ్వని వారు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని సూచించారు. తెలంగాణ జనాభా లెక్కల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పినట్టు ఎవరెంతో వారికంత న్యాయం జరగాలన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్లకు రాజకీయ విద్య ఉద్యోగ అవకాశాల్లో చట్ట బద్దత చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం స్పష్టం చేశారు. కులగణనలో పాల్గొనని వారు ఈనెల 28 వరకు నమోదు చేసుకోవచ్చని, దీని కోసం టోల్ ఫ్రీ నం. 040-211 11111ను ఏర్పాటు చేయడం జరిగిందని, తాము కుల సర్వేలో పాల్గొనలేదని ఫోన్ చేసిన వారి ఇంటికి వెళ్లి ఎన్యుమరేటర్లు వెళ్లి వివరాలు నమోదు చేయాలన్నారు. ఎంపిడిఒ కార్యాలయం, వార్డు ఆఫీసులకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని పొన్నం సూచించారు. ఆ÷-లనైన్ లో నమోదు చేసుకునే వారు కులగణన కోసం ఇక్కడ క్లిక్ చేయాలని సూచించారు, కులగణన సర్వేలో 3,56,323 కుటుంబాలు పాల్గొనలేదన్నారు. సర్వేలో పాల్గొని అందుతున్న పథకాలు అర్హులుగా ఉండాలన్నారు. ఎక్కడెక్కడ కుల సర్వేలో పాల్గొనలేదో అక్కడ కుల సంఘాల నేతలు, మేధావులు ఫ్రొఫెసర్లు వారికి అవగాహన కల్పించాలని, వారిని భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# కారణజన్ముడు కేసీఆర్


(మొదటి పేజి తరువాయి)

గజ్వేల్‌లో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఓ పెళ్లికి హాజరైన కెసిఆర్ దంపతులకు అక్కడ అనుకోని ఘటన ఎదురయ్యింది. సోమవారం కెసిఆర్ బర్త్‌డే కావడంతో నిర్వాహకులు దండలు తెచ్చి ఇవ్వడంతో కెసిఆర్ దంపతులు పరస్పరం మార్చుకున్నారు. ఇకపోతే కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్ కు అభిమానులు, పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డితో పాలు పలువురు కీలక నేతలు కేసీఆర్ ను కలవడానికి వచ్చారు. కేసీఆర్ ను కలిసి బర్త్ డే విషెస్ చెప్పారు. భారీగా తరలివచ్చిన అభిమానులకు కేసీఆర్ ఫామ్ హౌస్ బాల్కనీ నుంచి అభివాదం తెలిపారు. కేసీఆర్ ఇవాళ ఫిబ్రవరి 17న 71వ పుట్టిన రోజు జరుపుకుంటున్న సంగతి తెలిసిందే.. కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ గా బర్త్ డే విషెస్ చెప్పారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని కోరారు. మంత్రి పొన్నం, ఏపీ డిప్యూటీ సీఎం పవన్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్, మంత్రి నారా లోకేష్ కేసీఆర్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో కూడా కేసీఆర్ బర్త్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు బీఆర్ఎస్ నేతలు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు,కార్యకర్తలు పాల్గొన్నారు. హరీశ్ రావు, కేటీఆర్,తలసాని పలువురు నేతలు 71 కిలోల కేక్ కట్ చేశారు.

# కులగణన కొరివితో తలగోక్కున్న కాంగ్రెస్

(మొదటి పేజి తరువాయి)

ఏనాడైనా టీచర్లు, నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ కొట్లాడిందా అని అన్నారు. ..బీఆర్ఎస్ పనైపోయింది. అందుకే అభ్యర్థిని కూడా నిలబెట్టలేకపోయింది.. కాంగ్రెస్ తో కుమ్మక్కై బీజేపీని ఓడించాలని బీఆర్ఎస్ చూస్తోంది,.. క్రైస్తవుల్లో చాలా మంది ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకుంటూ ఎస్సీలను మోసం చేస్తున్నారు.. ఇంత జరుగుతుంటే సంఘాలు ఎందుకు స్పందించడం లేదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాయడమే కుల సంఘాల పనా?.. మేధావులారా?. కాంగ్రెస్ ను ఓడించండి? బీజేపిని గెలిపించండి’ అని బండి సంజయ్ అన్నారు.



## శ్రీశ్రీశ్రీ సతీషన్ నాయర్ గురుస్వామి కి నివాళులు అర్పించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..అందే బాబయ్య..

ప్రజావినికిడి,(షాద్ నగర్):
సోమవారం రోజు శ్రీశ్రీశ్రీ సతీషన్ నాయర్ గురుస్వామి ప్రథమ వర్ధంతి సందర్భంగా పాలమాకులలోని స్వామి వారి సమాధి దగ్గర వారి చిత్రపటానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందే బాబయ్య నివాళులు అర్పించారు.వారితో పాటు దేపల్లి అశోక్ గౌడ్,మల్చలం మురళి,రవి నాయక్,సుదర్శన్ గౌడ్,భాను తదితరులు పాల్గొన్నారు.



## అగ్గికి బూడిదైన లక్నవరం అడవులు



ములుగు జిల్లా, గోవిందరావుపేట మండలంలో అతిముఖ్యమైన పర్యాటక కేంద్రంగా ఎప్పుడూ పర్యాటకులతో సందడిగా ఉండే లక్నవరం చెరువు ఒకటి ముఖ్యమైనది. పచ్చని దట్టమైన అడవులు, గుట్టల మధ్య పర్యాటకులను ఆకర్షించే విధంగా నీళ్లతో ఉండే లక్నవరం చెరువు ఉన్న ప్రాంతంలో నిప్పు అంటుకొని మసిగా మారిపోయి అందవిహీనంగా కనబడుతూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనబడుతోంది. చెరువు చుట్టూ ఉన్న గుట్టలకు మూడు రోజుల నుండి నిప్పు అంటుకొని 70 శాతం తగలబడ్డాక అధికారులు అప్రమత్తమై నిప్పులను చల్లార్చుతున్నారు. అటవీ ప్రాంతం ఇంతలా తగలబడేదాకా అధికారులు ఏమి చేస్తున్నారనేది పర్యాటకుల మదిలో మెదులుతున్న ప్రశ్న.లక్నవరం అలుగు నుండి తూముల వరకు సుమారు 70 శాతం దాకా నిప్పు అంటుకొని తగలబడిపోతూ ఉంటే నిన్న మొన్నటి నుండి మంటలు ఆర్పుతున్నామని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. పచ్చని అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతి కావడం మానవాతీతమ తప్పిదమా లేక ప్రకృతి వైపరీత్యమో తెలియదు. కానీ కాలిపోయిన అడవిని చూస్తుంటే హృదయం ద్రవించిపోతోందని పలువురు పర్యాటకులు వాపోతున్నారు. అడివి తగలబడి పోవడానికి గల కారణాలు తెలుసుకొని తగిన పటిష్ట చర్యలు చేపట్టి మళ్లీ ఇలాంటి దురదృష్టకరన ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను పర్యాటకులు కోరుతున్నారు.





# ‘ఓ లింగ ఓ లింగా’

## నామస్మరణతో ప్రారంభమైన పెద్దగట్టు జాతర

**ఎటుచూసినా జనసంద్రం...**

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు**

**ఈనెల 20 వరకు ట్రాఫిక్ మళ్లింపు : డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి**



సూర్యాపేట,ఫిబ్రవరి17ప్రజావినికిడి:
శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర ప్రారంభమైంది. ఆదివారం అర్ధరాత్రి దేవరపెట్టె చేరుకోవడంతో దురాజ్ పల్లి పెద్దగట్టు జాతర ప్రారంభమైంది. ‘ఓ లింగ ఓ లింగా’ నామస్మరణతో పెద్దగట్టు మారుమ్రోగుతోంది. గుట్ట చుట్టూ వాహనాలు చేరి.. జాతర భక్త జనసంద్రంగా మారింది. సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి లింగమంతుల స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించారు. గా తెలంగాణలో సమ్మక్క సారలమ్మ జాతర తరువాత రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన సూర్యాపేట శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర ఆదివారం రాత్రి ప్రారంభమైంది. జాతరలో కీలకమైన దేవరపెట్టె (అందెనపు చౌడమ్మ, లింగమంతుల స్వామి ఉత్సవ మూర్తులు)కు ఆనవాయితీ ప్రకారం కేసారం గ్రామంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవరపెట్టెను ఊరేగింపుగా ఆదివారం అర్ధరాత్రికి దురాజ్‌పల్లిలోని పెద్దగట్టుకు చేర్చారు. దీంతో జాతర ప్రారంభమైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. కేసారంలోని మెంతబోయిన వంశస్తులకు చెందిన దేవరగుడిలో దేవరపెట్టెకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మున్నా, గొర్ల, కులస్తులతోపాటు సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీషరెడ్డి, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేషరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇక, పెద్దగట్టు జాతర నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నామని కోదాడ డీఎస్పీ ఎం. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లించి, హుజుర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు పంపుతారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను కూడా అదే మార్గంలో కోదాడ వద్ద జాతీయ రహదారితో కలవనున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఈ ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది.

# పోలీసులకు లిఖితపూర్వక వివరణ ఇచ్చిన పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి: ఫామ్‌హౌస్‌కు సంబంధించి వివరాలు ఇవ్వాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. దీంతో న్యాయవాదితో కలిసి వచ్చిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మొయినాబాద్ పోలీసులకు సోమవారం లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. కోడి పందాలు ఆడించిన ఫామ్ హౌస్ తనదేనని 2023 వర్రా రమేష్ కుమార్ రెడ్డికి లీజ్‌కు ఇచ్చినట్లు పోచంపల్లి పేర్కొన్నారు. రమేష్ కుమార్‌తో పాటు మరొకరి కూడా లీజ్‌కు ఇచ్చినట్లు వెల్లడించారు. లీజ్ పత్రాలను కూడా పోలీసులకు అందజేశారు పోచంపల్లి. లీజ్‌కు ఇచ్చిన భూమిని ఏపీకి చెందిన వ్యాపారి భూపతి రాజు శివ కుమార్ వర్మ అలియాస్ గబ్బర్ సింగ్ తీసుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు. కోడి పందాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వివరణ ఇచ్చారు. కాగా.. భూపతిరాజు శివకుమార్ వర్మ అలియాస్ గబ్బర్ సింగ్ అనే వ్యక్తి అదే ఫామ్‌హౌస్‌లో రెండు మూడు సార్లు పెద్దఎత్తన కోడిపందాలు, క్యాసినోలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇటీవల మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో మరోసారి కోడిపందాలు నిర్వహించాడు గబ్బర్ సింగ్. సంక్రాంతి పండగ తర్వాత మిగిలిన కోళ్లను ఫామ్‌హౌస్‌కు తీసుకువచ్చి కోడిపందేలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇందులో చాలామంది బిజినెస్‌మెన్స్, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కోడిపందాలకు హాజరయ్యారు. దీనిపై పక్కా సమాచారంతో ఎస్వోటీ పోలీసులు ఫామ్‌హౌస్‌పై దాడులు చేశారు. అయితే అప్పటికే పలువురు తప్పించుకోగా.. కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోళ్ల పందాలు నిర్వహిస్తున్న భూపతి రాజు శివకుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ దాడిలో మొత్తం 64 మందిని అరెస్టు చేశారు. పందాలకు వినియోగిస్తున్న రూ.30 లక్షల నగదు, 55 లగ్జరీ కార్లు, పందాల కోసం ఉపయోగించే 86 కోళు ,, కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో 10 మంది తెలంగాణకు చెందిన వారు కాగా.. మిగిలిన వారు అంతా ఏపీ వాసులే. ఈ వ్యవహారంపై మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో గేమింగ్ చట్టం, జంతువులపై క్రూరత్వం నిరోధక చట్టం కింద కేసు నమోదు అయ్యాయి. అయితే ఈ ఫామ్‌హౌస్ యజమానిగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ ఉండటంతో ఆయనకు నోటీసులు నోలీసులు ఇవ్వగా, పోచంపల్లి శ్రీనివాస్ ఈ మేరకు వివరణ ఇచ్చారు.

## సూర్యాపేట లో క్రైస్తవుల ఆధ్వర్యంలో కెసీఆర్ జన్మదిన వేడుక

**బిషప్ దుర్గం ప్రభాకర్ తెలంగాణా రాష్ట్ర క్రైస్తవ నాయకులు**

**దారావత్ లాకు రేణుక నాయక్ బి.ఆర్.యస్. సూర్యాపేట జిల్లా నాయకులు**



సూర్యాపేట ఫిబ్రవరి17ప్రజావినికిడి:
సూర్యాపేట పట్టణ కేంద్రం లోని 6 వ వార్డు,శాంతినగర్ నందు తెలంగాణా రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ నివాసంలో తెలంగాణ ఉద్యమ శిఖరం, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, బంగారు తెలంగాణ నిర్మాత,తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుట్టినరోజు సందర్భంగా ఆంధ్ర తెలంగాణా రాష్ట్రాల సువార్త చర్చ్ కో - ఆర్డినేటర్ పాస్టర్ సి. హెచ్. శ్యామ్ ప్రసాద్ వారి ఆరోగ్యం కొరకు ప్రార్థన చేయగా బిషప్ దుర్గం ప్రభాకర్, దారావత్ లాకు రేణుక నాయక్ లు కేక్ కట్ చేసి కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాస్టర్స్ వరికుప్పల మత్తయి, చెట్టుపల్లి కిరణ్ కుమార్, పి. వి. బోయాజ్, బానోత్ సుధాకర్, రెడ్డిపల్లి ప్రేమ్ కుమార్, కత్తుల సుధాకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీ వారసత్వానికి అర్హులుగా ఉంటానికి ప్రతిక్షణం కృషి చేస్తా

**మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్**

హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి:
మీ వారసత్వానికి అర్హులుగా ఉంటానికి ప్రతీ క్షణం కృషిచేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ట్వీటర్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ‘ప్రతి తండ్రీ తమ పిల్లల హీరో అని అంటారు. నా తండ్రి నా ఒక్కడికే కాదు.. తెలంగాణ హీరో కావడం నా అదృష్టం. కల కనడం.. దాని కోసం హద్దులేని నిబద్ధతతో బయలుదేరారు. విమర్శకులను ఎదుర్కోవడం, అది ఎలా నెరవేరుతుందో వారికి గర్వంగా చూపించారు. తెలంగాణ అనే కలను ప్రేమించారు. వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించకుండా తెలంగాణ సాధించారు. మీరు గర్వంగా మీ కొడుకని పిలుచుకునే వ్యక్తి కావడమే నా లక్ష్యమని కేటీఆర్ తెలిపారు.


# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అందే బాబన్న..

ప్రజావినికిడి,(షాద్ నగర్):
బిజెపి షాద్ నగర్ పట్టణ అధ్యక్షుడు హరి భూషణ్ కుమారుడు( కీర్తిశేషులు) నీరజ్ జన్మదినం సందర్భంగా షాద్ నగర్10%ష్ట్ర% వార్డులో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య మాట్లాడుతూ,హరి భూషణ్ సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుంది. ఈ శుభసందర్భలో కొడుకు లేకపోవటం బాధాకరం అని వారు ఆవేదన వ్యక్తం అన్నదానం మన భారతీయ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదిగా భావించబడుతుంది. భూషణ్ సేవా మనోభావం, నిస్వార్థంగా ప్రజలకు చేయూతనివ్వాలనే తపన నిజంగా ప్రశంసించదగినది అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరై భాగస్వాములయ్యారు



# ముస్లిం ఉద్యోగులకు శుభవార్త

హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి:
ముస్లిం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులు తమ పని వేళల కంటే గంట ముందే ఇళ్లకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. తమ మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు. మార్చి 2 నుంచి మార్చి 31 వరకు ఈ వెసులుబాటు ఉంటుంది. ముస్లిం ఉద్యోగులు తమ విధుల నుండి సా.4 గంటలకే తమ ఇళ్లకు వెళ్లేలా అనుమతి కల్పించారు. ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న ముస్లిం ఉద్యోగులు, టీచర్లు, కాంట్రాక్ట్ వర్కర్లు, ప్రభుత్వ రంగం సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్పొరేషన్‌లలో పనిచేసే ఉద్యోగులందరికీ ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని సిఎస్ పేర్కొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతి

## మెట్టు సాయి కుమార్



ప్రజావినికిడి, (ముషీరాబాద్):
కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతని తెలంగాణ ఫిషర్మెన్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సామాజిక పార్టీ వ్యవస్థాపక చైర్మన్ సైదులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినరజకుల ఆత్మీయ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ, బిఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం ఉన్న రిజర్వేషన్లను 28 శాతం కుదించిన విషయాన్ని గుర్తు చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి 47 శాతం బీసీలకు రిజర్వేషన్లను కేటాయిస్తారని తెల్చి చెప్పారు. బిఆర్ఎస్,బిజెపి మంత్రులు ఓ బీసీ నాయకున్ని రాష్ట్ర అధ్యక్షునిగా చేశారాని ప్రశ్నించారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా తెలంగాణ రాష్ట్రంలో కులగననను చేపట్టింది సీఎం రేవంత్ రెడ్డేనని స్పష్టం చేశారు. బీసీల నాయకత్వాన్ని బలహీనం చేసింది బిఆర్ ఎస్, బీజేపీలేనని బీసీల నాయకత్వాన్ని బలపరుస్తుందని కాంగ్రెస్ పార్టీ అని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. బిజెపి, బిఆర్ఎస్ బీసీల అభివృద్ధికిపాటుపడడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. బీసీలలో అభివృద్ధి చేసే ఏకక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆటపాటల్లో రాణించాలి..

## చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి




ప్రజావినికిడి, (ముషీరాబాద్): విద్యార్థుల్లో ఆటపాటల్లో రాణించినప్పుడే చదువులో కూడా ఉత్తీర్ణతను సాధిస్తారని నాలెడ్జ్ హై స్కూల్ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 35వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్య అతిథులు విచ్చేసి విద్యార్థుల ఆటపాటలను తిలకించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు చదువులతో పాటు ఆటపాటల్లో రానిస్తేనే భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణిస్తారని కొనియాడారు. అంతేకాకుండా తదేకంగా చదువులో పడితే పిల్లలు ఎదగలేరని ఆటపాటలతో కలిపి ఆడిస్తే చురుకుదనంతో పాటు ఆనందంగా ఉంటారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు వారు ఎంచుకున్న రంగాలలో రాణిస్తే రేపటి దేశ భవిష్యత్తు తరాల వారికి ఎంతో ఉపయోగపడతారని అన్నారు. నేటి సమాజంలో విద్యార్థుల దశ మరోవైపు వెళ్ళకుండా ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆటలు పాటల క్రీడలతో రాణిస్తే విద్యార్థులు వారి తల్లిదండ్రులు కూడా అభినందిస్తారని తెలిపారు. వైజ్ఞానికంగా పిల్లలకు మంచి పరిజ్ఞానం అందించినప్పుడే వారి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుందని హితవు పలికారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్ష ఎన్నికలకు

# నామినేషన్ వేసిన అమరవాది లక్ష్మి నారాయణ..

**అమరవాది లక్ష్మీనారాయణ ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కృషి**





ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
మార్చ్ 4 వ తేదిన జరగబోయే తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష ఎన్నికలకు అమరవాది లక్ష్మీనారాయణ ర్యాలీగా తరలి వెళ్లి లకిడికపూల్ లోని వాసవి భవన్ లో నామినేషన్ వేయడం జరిగింది. ఈ నామినేషన్ కి తెలంగాణలో అన్ని జిల్లాల అధ్యక్షులు హాజరయ్యారు. అనంతరం కర్మన్ ఘట్ లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అన్ని జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అన్ని జిల్లాల అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ నాయకత్వాన్ని బలపరిచారు. అంతేకాకుండా అమరవాది లక్ష్మీనారాయణ ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తన ఆధ్వర్యంలోనే ఉప్పల్ భగాయత్ ఆర్యవైశ్య మహాసభ కోసం 5 ఎకరాలు భూమిని సాధించానని, అందులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలని అందరం కూర్చొని చర్చించి,తను ఈసారి ఎన్నికల్లో గెలవగానే భవన నిర్మాణం పూర్తి చేస్తానని తెలిపాడు.

# ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు




ప్రజావినికిడి,(ఎల్బీనగర్): తెలంగాణ జాతిపిత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు శివ ప్రకాష్ ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోని ఆదర్శ అనాధ ఆశ్రమంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి అల్పాహారం, పండ్లు,ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం శివ ప్రకాష్ మాట్లాడుతూ,కెసిఆర్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోని ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ కెసిఆర్ కోసం ఎదురుచూస్తున్నారని కేసీఆర్ ముఖ్యమంత్రిగా రావాలని కోరుతూ కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని ఇప్పుడు ఏ పథకం అందట్లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు తోట మహేష్ యాదవ్, సొంటి చంద్రశేఖర్ రెడ్డి,అజయ్ కుమార్, రవి యాదవ్,ప్రవీణ్ చారి,సాయి యాదవ్,సూర్య, సుబ్బు,కుందరపు రాజేష్,గణేష్,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ పిల్లలు వాహనాలు నడపవద్దు..

**మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు..**
**ఏఎస్ఐ అనంత రాములు..**
**జిహెచ్ఆర్ కేశంపేట రహదారిపై పోలీసుల తనిఖీలు..**



ప్రజావినికిడి,(షాద్ నగర్):మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారాలు ఉంటాయన్ని ఏఎస్ఐ అనంతరాములు అన్నారు. సోమవారం షాద్ నగర్ పట్టణం జిహెచ్ ఆర్ కేశంపేట్ రోడ్డులో వాహనాలను ఏఎస్ఐ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ అనంతరాములు మాట్లాడుతూ,వాహన దారులు వాహన కాగితాలు వెంబడి పెట్టుకోవాలని సూచించారు. మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే ప్రమాదాలకు గురి అయ్యే అవకాశాలు ఉంటాయని అన్నారు. మైనర్ పిల్లల ద్వారా ప్రమాదాల జరిగితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. అదేవిధంగా వాహనాలను నియంత్రణ వేగంలో నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రాజు నాయక్,రమేష్ పాల్గొన్నారు.

# మేకగూడకు బస్ కావాలని టీఎస్ ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ కు వినతి పత్రం అందజేసిన శ్రీవర్ధన్ రెడ్డి..అందే బాబయ్య



ప్రజావినికిడి,(నందిగామ):
నందిగామ మండలం మేకగూడ గ్రామానికి నూతనంగా ఆర్టీసీ బస్ ప్రారంభించాలని సోమవారం రోజు రాజేంద్రనగర్ టిఎస్ఆర్ టి సి ప్రాంతీయ మేనేజర్ బద్రీనాథ్ కు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందే బాబయ్య,దేపల్లి అశోక్ గౌడ్ వినతి పత్రాన్ని అందజేశారు. ఇందులో భాగంగా మేనేజర్ బద్రీనాథ్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మల్చలం మురళి,మేకగూడ గ్రామస్తులు భాను ప్రసాద్,సాయి ప్రకాష్, రవి తేజ,రాఘవేందర్, శ్రీను,ప్రేమ్,దీక్షిత్, సత్యం,వంశీ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలో కేసీఆర్ జన్మదిన వేడుకలు..

**ఎస్ బి పల్లిలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు.**

**కేక్ కట్ చేసిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ..**



ప్రజావినికిడి(కొత్తూరు):
రాష్ట్రంలోని వాడవాడలో కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ అన్నారు. కేసిఆర్ జన్మదినన్ని పురస్కరించుకొని సోమవారం ఆయన మండలంలోని ఎస్ బి పల్లి గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు కుమ్మరిగూడెం పాండు ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, అపర భగీరథుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన కొనియాడారు. రాష్ట్రంలో కెసిఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని,రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు కడల శ్రీశైలం, నాయకులు ఎమ్మె నరసింహ,అంబటి కృష్ణ,ఎమ్మె అజయ్, తిరుపతయ్య, బుడుగు ఆంజనేయులు, అంబటి కన్నయ్య, రాజేష్,ఎమ్మె ఐలేష్, ఎమ్మె రాఘవేందర్,జె మహి,అర్ల కుమార్, ఎస్ మల్లేష్,అంబటి చంద్రయ్య,మియ్యాడ కుమార్,చెక్కల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# వీరాంజనేయ స్వామి ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు



హైదరాబాద్,ఫిబ్రవరి17ప్రజావినికిడి: బీఆర్ఎస్ పార్టీ అధినేత పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో వేదికలు ఏర్పాటు చేసి కేకులు కట్ చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత కూడా తన తండ్రి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నందినగర్‌లోగల వారి నివాసం సమీపంలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆలయానికి వెళ్లిన కవిత.. తన తండ్రి ఆయురారోగ్యం కోసం ప్రత్యేక పూజ నిర్వహించారు.

# కేసీఆర్ మీరు లేని రాష్ట్రం రావణ కాష్టం...

## నూతన పాట విడుదల..

**కేసీఆర్ పాలన లేని విదానం పై పాట రాయించిన ఎమ్మెల్సి నవీన్ రెడ్డి..**
**పాటను విడుదల చేసిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు..**




ప్రజావినికిడి,(హైదరాబాద్):
పాట విడుదల కార్యక్రమంలో మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్,ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి,ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,
తెలంగాణ రాష్ట్ర సాధకుడు,పోరాట ఉద్యమ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినం సందర్భంగా హైదరాబాద్ లోని భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో కేసిఆర్ రాష్ట్రంలో లేని పరిపాలనలో జరుగుతున్న విధానంపై ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నూతనంగా రాయించిన కేసిఆర్ మీరు లేని రాష్ట్రం రావణ కాష్టం అనే పాటను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అలాగే మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు విడుదల చేశారు. పాట విడుదల కార్యక్రమంలో మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్,ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,పాల్గొన్నారు. ఈ కార్యక్రమం షాద్ నగర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బుచ్చిగూడ వెంకట్ రెడ్డి,కొందుర్గు జడ్పి టిసి తనయుడు రామక్రిష్ణ మాదేవ్ పూర్ రవిందర్ రెడ్డి, శివాచారి తదితరులు పాల్గొన్నారు.


Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# తిరుపతిలో ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్

## చంద్రబాబు సహా మహారాష్ట్ర, గోవా సిఎంల హాజరు -మూడు రోజులపాలు జరిగనున్న కార్యక్రమం



తిరుపతి ఫిబ్రవరి17(ప్రజావినికిడి: : ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. మూడు రాష్ట్రాల సీఎంలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్, తిరుపతి జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడుతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కన్వెన్షన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ హార్దిక అభినందనలు తెలుపుతూ రాసిన లేఖను నిర్వాహకులు చదివి వినిపించారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్ పాల్గొన్నారు. ఈ ఎక్స్‌పోలో భాగంగా నిపుణుల మధ్య ఆలయాలపై చర్చలు, వర్క్‌షాపులు జరగనున్నాయి. టెంపుల్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో అంత్యోదయ ప్రతిష్ఠాన్ సహకారంతో తిరుపతిలోని ఆశ కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ దేవాలయాల సమావేశ ఎక్స్‌పో కొనసాగనుంది. దేవాలయాల నిర్వహణలో ఉత్తమ పద్ధతులను తెలియజేసే ఈ



ప్రత్యేక జ్ఞాన పంచన కార్యక్రమంలో నిపుణుల నేతృత్వంలో చర్చలు, ప్రదర్శనలు, వర్క్‌షాపులు, మాస్టర్‌క్లాసులు- టెంపుల్ టాక్స్ జరుగనున్నాయి. 58 దేశాల నుంచి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన మతాల భక్తి సంస్థల ప్రతినిధులు పలువురు పాల్గొంటారు. ఎ౹ఃఅఛీ ద్వారా 58 దేశాల్లో 1,581 దేవాలయాలను ఒకే వేదికపై అనుసంధానించడం ఈ కార్యక్రమం ద్వారా చేపట్టనున్నారు. ఈ కన్వెన్షన్‌లో పునరుత్పాదక ఇంధనం, దేవాలయ పాలన, దేవాలయ ఆర్థిక వ్యవస్థ, స్మార్ట్ టెంపుల్ పరిష్కారాలు వంటి అంశాలపై సెమినార్లు నిర్వహిస్తారు.

# రాజకీయ కక్షతోనే కేసులు బనాయించారు

## బెయిల్ పిటిషన్ దాఖలుచేసిన వంశీ



విజయవాడ,ఫిబ్రవరి17(ప్రజావినికిడి: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తరపున ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ పిటిషన్‌తో పాటుగా వంశీ మెడికల్ రిపోర్టులతో మరో పిటిషన్ కూడా ఇచ్చారు. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యేక వైద్య వసతులు, ఇంటి నుంచే ఆహారం అందించే సదుపాయం కల్పించాలని కోరారు. మరోవైపు.. ఇప్పటికే వంశీని కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తన బెయిల్ పిటిషన్‌లో వంశీ కీలక అంశాలను వెల్లడించారు. బెయిల్ పిటిషన్‌లో భాగంగా వంశీ..'తనపై రాజకీయ, వ్యక్తిగత కక్షతో కేసులు నమోదు చేశారు. సత్య వర్ధన్‌ను తాను కిడ్నాప్ చేశాననేది అక్రమంగా పెట్టిన కేసు. తన తల్లితో కలిసి ఆటోలో కోర్టుకి వచ్చినట్టు సత్య వర్ధన్ కోర్టుకు తెలిపాడు. గతంలో కోర్టుకు హాజరు కావాలని పలుమార్లు నోటీసులు కోర్టు ఇస్తే సత్య వర్ధన్ వచ్చారు. కేసుతో తనకు సంబంధం లేదని తనను ఎవరూ తిట్టలేదని పోలీసులకు కూడా గతంలోనే సత్య వర్ధన్ స్టేట్ మెంట్ ఇచ్చారు. అదే విషయాన్ని మళ్లీ కోర్టుకు సత్య వర్ధన్ తెలిపారు తప్ప నా ప్రమేయం లేదు' అని తెలిపారు. ఇక, మెడికల్ గ్రౌండ్స్‌లో బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయని మరో పిటిషన్ దాఖలు చేశారు. వెన్నుపూస నొప్పి కారణంగా జైలులో తనకు బెడ్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించాలని, ఇంటి నుంచి ఆహారం తెప్పించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే జైలు అధికారులతో తనకు వెన్నుపూస నొప్పి ఉందని మంచం కావాలని జైలు అధికారులను కోరారు. జైలు అధికారులు కోర్టులో పిటిషన్ వేసుకోవాలని సూచించడంతో వంశీ పిటిషన్ దాఖలు చేశారు.

# అంగన్వాడీల జీతాలు పెంచాల్సిందే

## బడ్జెట్ కేటాయింపులు చేయండి

## అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్



విశాఖ ఫిబ్రవరి 17(ప్రజావినికిడి: అంగన్వాడీల జీతాలు పెంపుదల చేస్తూ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావమ్మ డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్, ఆయాలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జివిఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ముందుగా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019 సంవత్సరం నుండి అంగన్వాడీలుకి వేతనాలు పెంచలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు అంగన్వాడీ 42 రోజులపాటు సమ్మె చేయటంతో, ప్రభుత్వం దిగివచ్చి తమ యూనియన్ తో ఒప్పందం చేసుకుందన్నారు. ఒప్పందం ప్రకారం 2024 జూలై నెల నుంచి వేతనాలు పెంచాల్సి ఉందని చెప్పారు. అయితే ఆనాటి నుంచి ఈనాటి వరకు ఒప్పందం అమలు కాలేదని, వేతనాలు పెంపు చేయలేదని ఆరోపించారు. ఒప్పందం ప్రకారం వేతనాల పెంచాలన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు గ్రాడ్యుటి అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అది కూడా అమలకు నోచుకోలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్స్ గా మారుస్తూ జిఓ ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలన్నారు. అంగన్వాడీలపై పని ఒత్తిడి, యాప్ ల ఒచ్చిడి తగ్గించాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ,అంగన్వాడీ హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్ల తో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద ఈరోజు అంగన్వాడీలు నిరసన చేపట్టారని తెలిపారు. బ్జడెట్ సమావేశాల సందర్భంగా అంగన్వాడీల జీతాల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే, తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి కుమార్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జీబీఎస్ వ్యాధిపై ఆందోళన అవసరం లేదు

## అందుబాటులో వ్యాధికి అవసరమైన ఔషధాలు -ఆరోగ్యశృాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

అమరావతి,ఫిబ్రవరి17(ప్రజావినికిడి: గులియన్ బారీ-సిండ్రోమ్ జీబీఎస్ వ్యాధిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో జీబీఎస్ బాధితులకు అందించేం దుకు సరిపడా ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు ఉన్నాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ వ్యాధి సోకినా 85 శాతం చికిత్స అవసరం లేకుండా తగ్గిపోతుంది. 15 శాతం మాత్రం ఇంజెక్షన్లు ఇవ్వాల్సిన అవసరం వస్తుందని అన్నారు. దీనివ్యాప్తిపై ఆందోళన కలుగుతున్న వేళ ఆయన అధికారులతో సమీక్షించారు. అనంతరం సచివాలయంలో ఆయన ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. జీబీఎస్ రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. జీబీఎస్ రోగులకు సరిపడా ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. చికిత్స తీసుకోకుండానే చాలావరకు వ్యాధి తగ్గిపోతుందని



చెప్పారు. రాష్ట్రంలో 43 జీబీఎస్ కేసులు నమోదు కాగా.. ప్రస్తుతం 17 మంది చికిత్స పొందుతున్నారు. గతేడాది, ఈ ఏడాది కలిపి మొత్తం రోగుల పూర్వాపరాలను పరిశీలించి.. ఈ వ్యాధి సోకడానికి కారణాలు, దారితీసే పరిస్థితులను గుర్తించాలని వైద్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించామని అన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమీక్షిస్తున్నామని మంత్రి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజెక్షన్లు సరఫరా చేస్తున్నాం. అనంతపురం, గుంటూరు, కడప, కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖ జీజీహెచ్‌లలో 749 ఇంజెక్షన్లు ఉన్నాయి. అదనంగా మరో 469 ఇంజెక్షన్లు ఉన్నాయి. వీటిలో 425 ఇంజెక్షన్లను లభ్యత లేని ఇతర జీజీహెచ్‌లకు తరలిస్తున్నాం. అవసరం మేరకు అదనంగా ఈ ఇంజెక్షన్లను కొనుగోలు చేస్తాం. ఈ వ్యాధి బారిన పడినవారికి చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఒక్కో ఇంజెక్షన్ ధర రూ.20వేలు చొప్పున ఉంటుంది. అలాంటివి రోజుకు ఐదు ఇంజెక్షన్లు ఇవ్వాలి. మొత్తంగా ఐదు రోజుల పాటు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఖర్చు గురించి ఎక్కడా ఆలోచించకుండా.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు తగినన్ని ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచుతోందని మంత్రి సత్యకుమార్ వివరించారు.

# గుంటూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## కూలీలతో వెలుతున్న ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు ఘటనాస్థిలోనే ముగ్గురు మహిళా కూలీల దుర్మరణం

## ప్రధా ఘటనపై సిఎం చంద్రబాబు, మంత్రుల దిగ్భ్రాంతి క్షతగాత్రులకుమెరుగైన వైద్యం అందించాలని ఆదేశం






గుంటూరు,ఫిబ్రవరి17(ప్రజావినికిడి:

గుంటూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీ మహిళలు ప్రయాణిస్తున్న ఆటోను పల్లె వెలుగు బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో ఏడుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకున్నారు. గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. సుద్ధపల్లి నుండి కంతేరుకు 10 మంది మహిళా కూలీలు సోమవారం ఉదయం ఆటోలో బయల్దేరారు. చేబ్రోలు మండలం నారా కోడూరు-బుడంపాడు గ్రామాల మధ్య గుంటూరు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు.. ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతులు సుద్ధపల్లికి చెందిన అల్లంశెట్టి అరుణ, కుర్రా నాంచారమ్మ, తోట సీతారాములుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో వ్యవసాయ కూలీల మృతిపై సీఎం విచారం వ్యక్తం చేశారు. కూలీ పనుల కోసం వెళ్తున్న మహిళలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విచారకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రోడ్డు ప్రమాదంపై మంత్రి నాదెండ్ల మనోహర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందడం దురదృష్టకరమని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మృతి చెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి... బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాదంలో ముగ్గురు కూలీలు దుర్మరణం చెందిన ఘటన కలచి వేసిందని జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ప్రమాద వార్త తెలిసిన వెంటనే జిల్లా అధికారులతో మంత్రి దుర్గేష్ ఫోన్లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. అనంతరం జీజీహెచ్ లో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు మంత్రి దుర్గేష్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పరామర్శించారు. జీజీహెచ్‌లో మృతుల కుటుంబ సభ్యులను ధూళిపాళ్ల ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళా కూలీలు దుర్మరణం చెందడం విచారకరమన్నారు. చనిపోయిన వారందరూ కూడా రెక్కల కష్టం మీద జీవించేవారు కావడం బాధాకరమని అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ వైద్యులకు సూచించామని తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన మహిళల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బాధితులకు ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన రహదారిని మరింత విస్తరించే అంశం ఎంపీల ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పేర్కొన్నారు.

# ఎల్బీ నగర్ డీసీపీపై కాంగ్రెస్ నేత మధుయాష్కీ తీవ్ర ఆగ్రహం

**డీసీపీ తీరును ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానన్న మధుయాష్కీ**

**డీసీపీ శాంతిభద్రతలపై పార్ట్ టైమ్‌గా పని చేస్తున్నారని ఎద్దేవా**

**డీసీపీ ఇప్పటికైనా తీరు మార్చుకుంటే మంచిదని హితవు**

హైదరాబాద్,ఫిబ్రవరి17(ప్రజావినికిడి: హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్ డీసీపీ వ్యవహారశైలిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మధుయాష్కీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళతానని ఆయన తెలిపారు. ఎల్బీనగర్ డీసీపీ పూర్తి సమయం ల్యాండ్ సెటిల్మెంట్లలో నిమగ్నమయ్యారని విమర్శించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం మాత్రం పార్ట్ టైమ్‌గా పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎల్బీనగర్ డీసీపీ ఇప్పటికైనా తన ప్రవర్తనను మార్చుకోవాలని మధుయాష్కీ సూచించారు. ఒకవేళ డీసీపీ తన తీరును మార్చుకోకపోతే ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారని ఆయన హెచ్చరించారు. మధుయాష్కీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీ నగర్



నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విషయం తెలిసిందే.



# ఆ వాలెంటైన్స్ డేను ఎప్పటికీ మర్చిపోలేను : రకుల్



టాలీవుడ్ లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ తెలుగు లోని అగ్ర హీరోలందరితో సినిమాలు చేసింది. రకుల్ చివరిగా ఇండియన్2 సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించింది. ఆ మూవీలో పెద్దగా గుర్తింపు లేని పాత్ర చేసిన రకుల్ ప్రస్తుతం తన భర్త నిర్మాణంలో ఓ సినిమాలో నటిస్తోంది. రకుల్ బాలీవుడ్ యాక్టర్ కం ప్రొడ్యూసర్ జాకీ భగ్నానీని ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. 2021 నుంచి ప్రేమలో ఉన్న రకుల్, జాకీ గతేడాది ఫిబ్రవరిలో పెళ్లి చేసుకున్నారు. తన లైఫ్ లో వాలెంటైన్స్ డే ను మరిచిపోలేనని చెప్తోంది రకుల్ ప్రీత్ సింగ్. 2022లో వచ్చిన కర్ పుతలీ సినిమా టైమ్ నుంచి జాకీకి తనకు ప్రేమ మొదలైందని రకుల్ వెల్లడించింది.ఆ ఇయర్ లోనే తామిద్దరూ కలిసి మొదటి వాలెంటైన్స్ డే జరుపుకున్నట్టు తెలిపింది రకుల్. ఓ హెూటోల్లోని గ్రీన్ హౌస్ ఏరియాలో జాకీ క్యాండిల్ లైట్ డిన్నర్ అరేంజ్ చేసి ఓ వైపు గిటారిస్టుల పాటలు వింటుండగా, తన కోసం గులాబీ పూలు, బొకేలు తెచ్చి సర్ప్రైజ్ చేశాడని, ఆ వాలెంటైన్స్ డే తనకెప్పటికీ గుర్తుండిపోతుందని రకుల్ తెలిపింది. జాకీ లాంటి భర్త రావడం తన అదృష్టమని, ఇద్దరి ఆలోచనలు ఒకేలా ఉంటాయని, తాను చాలా హైపర్ అని, జాకీ కూల్ అని అందుకే లైఫ్ చాలా బ్యాలెన్స్ గా ఉందని చెప్తున్న రకుల్, ఏ విషయం గురించైనా తామిద్దరం కలిసి ఓపెన్ గా మాట్లాడుకుంటామని, ఒకరినొకరం సపోర్ట్ చేసుకుంటామని, పెళ్లికి ముందు తామెలా ఉన్నామో ఇప్పటికీ అంతే ఉన్నామని చెప్పుకొచ్చింది.భార్యాభర్తల మధ్య స్ట్రాంగ్ రిలేషన్ ఉండాలంటే దానికి నమ్మకం ఎంతో ముఖ్యమని, ఒకరినొకరు పూర్తిగా నమ్మాలని, ఆ నమ్మకమే బంధాన్ని మరింత స్ట్రాంగ్ గా చేస్తుందని చెప్తున్న రకుల్, పార్టనర్‌లో మంచి ఫ్రెండ్ ను చూసుకుంటే ఆ బంధం ఎప్పుడూ బలంగా ఉంటుందని, జీవితం హ్యాపీగా ముందుకెళ్లాలంటే నమ్మకం, స్నేహం, విశ్వాసం ఎంతో ముఖ్యమని చెప్పింది. ఇక పెళ్లి తర్వాత జీవితం గురించి చెప్తూ తన జీవితం పెళ్లయ్యాక మరింత బెటర్ అయిందని, అన్నీ అర్థం చేసుకునే జీవిత భాగస్వామి దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని రకుల్ తెలిపింది.

# తెలుగు హీరోయిన్లను ప్రోత్సహించకూడదని అనుకున్నాం : నిర్మాత ఎస్కేఎన్



తెలుగు హీరోయిన్లను ఉద్దేశించి నిర్మాత ఎస్కేఎన్ (శ్రీనివాస కుమార్ నాయుడు) చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. తాము తెలుగు రాని హీరోయిన్ లను అభిమానిస్తామని... ఎందుకంటే తెలుగు వచ్చిన అమ్మాయిలను ప్రోత్సహిస్తే ఏమవుతుందో ఈమధ్యనే తమకు అర్థమయిందని ఆయన అన్నారు. ఇక నుంచి తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించకూడదని తాను, డైరెక్టర్ సాయిరాజేశ్ నిర్ణయించుకున్నామని చెప్పారు. 'రిటర్న్ ఆఫ్ డ్రాగన్' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ కు ఎస్కేఎన్ గెస్ట్ గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. హీరోయిన్ వైష్ణవి చైతన్య గురించే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని చెప్పుకుంటున్నారు. వైష్ణవిని 'బేబీ' సినిమాతో హీరోయిన్ గా ఎస్కేఎన్ పరిచయం చేశారు. తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్న వైష్ణవి... ప్రస్తుతం సిద్దు జొన్నలగడ్డ, ఆనంద్ దేవరకొండల సినిమాల్లో నటిస్తోంది. తమ బ్యానర్ లో ఆమెకు ఎస్కేఎన్ మరో సినిమాను ఆఫర్ చేస్తే... ఆమె అంగీకరించలేదట. ఈ నేపథ్యంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారనే టాక్ నడుస్తోంది. ఆయన వ్యాఖ్యలను కొందరు నెటిజెన్లు తప్పుబడుతున్నారు. తెలుగు హీరోయిన్లు ఎదుగుతున్న తరుణంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని అంటున్నారు.

# ఆ హీరో తెగ ఇబ్బంది పెట్టేవాడు : శ్వేతబసు

మొదటి సినిమాతోనే కుర్రకారును హృదయాల్లో ప్రత్యేక క్రేజ్ తెచ్చుకుంది. కొన్నేళ్లుగా ఆమె తెలుగు సినిమాకు దూరంగా ఉంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన కెరీర్ గురించి మాట్లాడారు. ఒక తెలుగు సినిమా సెట్‌లో దారుణంగా అవమానించారని అన్నారు. ఆ సెట్‌లో ప్రతిఒక్కరూ శరీరాకృతి విషయంలో ఎంతగానె ఎగతాళి చేశారని చెప్పారు. ఆ మాటలు ఎంతగానో బాధించాయని ఆవేదన వ్యక్తం చేశారు. “నటిగా నేను సంతృప్తిగానే ఉన్నా. నాకు నచ్చిన సినిమాలు చేశాను. ప్రస్తుతం టెలివిజన్ ఇండస్ట్రీలో రాణిస్తున్నాను. కెరీర్ పరంగా ఇబ్బందిపడిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా ఒక తెలుగు సినిమా సెట్‌లో చాలా ఇబ్బందిపడ్డా. హీరోతో పోలిస్తే నేను ఎత్తు తక్కువగా ఉన్నానని సెట్‌లో ఉన్న ప్రతిఒక్కరూ నన్ను ఎగతాళి చ్గేసవారు. హీరో ఆరడుగులు ఉంటే ఈవిడేమో 5 అడుగులు ఉందని కామెంట్ చేసేవారు. ఇక, హీరోతో వచ్చిన సమస్య మరో స్థాయిలో ఉండేది. అతను ప్రతి సన్నివేశాన్ని మార్చేస్తుండేవాడు. గందరగోళానికి గురి చేసేవాడు. రీటేక్స్ ఎక్కువగా తీసుకునేవాడు. నిజం చెప్పాలంటే నాక్కూడా తెలుగు సరిగ్గా రాదు. కానీ, నేను ఏదో ఒకరకంగా డైలాగ్స్ నేర్చుకొని షాట్‌లో నడిపించేదాన్ని. అతను మాత్రం అలా కాదు. మాతృభాష తెలుగే అయినప్పటికీ అతనికి భాషపై పట్టు లేదు కానీ, నన్ను మాత్రం నా కంట్రోల్‌లో లేని నా ఎత్తు గురించి కామెంట్ చేసేవాడు. ఎత్తు అనేది వారసత్వంగా వస్తుంది కదా. దానికి నేనేం చేసేది. నాకు తెలిసి నేను అంత బాధపడిన సెట్ ఏదైనా ఉందంటే అదే” అని శ్వేతా బసు అన్నారు. 11 ఏళ్ల వయసులోనే నటిగా కెరీర్ ప్రారంభించింది శ్వేతా బసు ప్రసాద్. 'మక్డి' అనే సినిమా ఆమె నటించిన తొలి చిత్రం. 2008లో తెరకెక్కిన 'కొత్తబంగారు లోకం'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా విజయం తర్వాత 'రైడ్', 'కాస్కో', 'కళవర్ కింగ్', 'ప్రియుడు', 'జీనియస్' వంటి చిత్రాల్లో యాక్ట్ చేశారు. 2018లో విడుదలైన 'విజేత' తర్వాత ఆమె తెలుగు సినిమాల్లో యాక్ట్ చేయలేదు. వెబ్‌సిరీస్‌లు,సీరియళ్లుచేస్తూబిజీగా ఉంది. అప్పుడప్పుడు దర్శకత్వ శాఖలోనూ పని చేస్తుంటుంది.





# ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నా : సాయిపల్లవి

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని కోరికను బయటపెట్టేసింది సహజనటి సాయిపల్లవి. ఆమెకు జాతీయ అవార్డు అందుకోవాలని ఎంతో ఆశగా ఉందట. దానికి బలమైన కారణం కూడా ఉందట. ఆ విషయం గురించి ఆమె మాట్లాడుతూ 'పెళ్లప్పుడు కట్టుకోమని మా మామ్మ నాకు ఓ చీర ఇచ్చింది. అప్పుడు నాకు 21ఏళ్లు. అప్పటికింకా నేను సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వలేదు. అసలు ఆ ఆలోచనే లేదు. పెళ్లి చేసుకునేటప్పుడు కట్టుకుందామని ఆ చీర దాచుకున్నాను. కొనేళ్లకు అనుకోకుండా 'ప్రేమమ్'తో నటిని అయ్యాను. 'ఫిదా'తో మంచి పేరొచ్చింది. ఏదో ఒక రోజు తప్పకుండా ఒక ప్రతిష్టాత్మక అవార్డు కూడా అందుకుంటాననే నమ్మకం వచ్చింది. అందుకే.. జాతీయ అవార్డు అనేది నిజంగా నాకొస్తే.. అప్పుడు మా మామ్మ ఇచ్చిన చీర కట్టుకొని ఆ అవార్డు అందుకోవాలి అని నిశ్చయించుకున్నా. నిజంగా అవార్డు వచ్చినా, రాకపోయినా.. ఆ చీర ధరించే వరకూ ఆ ఒత్తిడి మాత్రం నన్ను వదలదు.' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి. నిజానిక్కూడా ఈ దఫా సాయిపల్లవికి నేషనల్ అవార్డు పక్కా అని పలువురి అభిప్రాయం. 'అమరన్'లోని ఆమె నటనకు తప్పకుండా అవార్డు వస్తుందని చాలామంది నమ్ముతున్నారు. అదే జరిగితే సాయిపల్లవి ఒత్తిడీ తీరుతుంది. అభిమానుల ఆకాంక్షా నెరవేరుతుంది.

# మరో ఘనతను దక్కించుకున్న అలియాభట్

బాలీవుడ్ క్యూట్ బ్యూటీ అలియాభట్‌కు మరో ఘనత సాధించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిభావంతమైన హీరోయిన్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ హైప్ ఆడిటర్ తాజాగా విడుదల చేసిన నివేదికలో అలియా సెకెండ్ ప్లేస్ సొంతం చేసుకుంది. జెన్నిఫర్ లోపెజ్ వంటి అంతర్జాతీయ నాయికలను వెనక్కినెట్టి అలియా టాప్‌లో ఉండడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా అభిమానులు ఆమెను విష్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో అలియాకు ఉన్న ఫాలోయింగ్ గురించి తెలిసిందే! ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను 8 కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారు. ఎప్పుడూ తన సినిమా, వ్యక్తిగత విశేషాలను అలియా ఫ్యాన్స్‌తో పంచుకుంటుంటారు. ఫొటోషూట్‌లతో ఆకట్టుకుంటారు. గతేడాది కూడా టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఆఫ్ 2024' జాబితాలోనూ చోటు దక్కించుకుంది అలియా. గత ఏడాది ఆమె 'జిగ్రా'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రం మిశ్రమ ఫలితాలకు పరిమితమైంది. తాజాగా అలియాకు సంబంధించిన వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రభాస్, హనురాఘవపూడి కాంబినేషన్‌లో రానున్న ఫౌజీ సినిమాలో అలియా యువరాణి పాత్రలో కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది. నాగ్ అశ్విన్ సినిమాలోనూ ఆమె నటించనున్నట్లు వారలు వస్తున్నాయి. ఈ వార్తలో ఎంత వరకు నిజం ఉంది అనేది అధికారిక ప్రకటన వస్తే తప్ప తెలియదు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613